క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

చిక్కడపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తానని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్ నుంచి హిమాయత్‌నగర్ వెళ్లే మార్గంలో నూతన ఐమాక్స్ పోల్ లైట్లను ఏర్పాటు చేయించి సిబ్బందితో పర్యవేక్షించారు. బీజేపీ నగర యువ నాయకులు వినయ్‌కుమార్, స్ట్రీట్ లైట్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటరమణరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ముషీరాబాద్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బీఆర్‌ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి హరిబాబుయాదవ్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శివముదిరాజ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రభుత్వ స్థలాలు, బస్తీలు, కాలనీలలో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని సూచించారు. బీఆర్‌ఎస్ నాయకులు సామాజిక బాధ్యతతో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలన్నారు. డివిజన్ బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షులు సయ్యద్ అహ్మద్ భక్తియార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, వెంకటేష్, దీన్‌దయాల్‌రెడ్డి, ప్రశాంత్, గోరఖ్‌నాథ్ తదితరులున్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని అనేక ప్రాంతాలను పర్యటిస్తూ కలుషిత తాగునీటి సమస్యపై వాటర్ వర్క్స్ కార్యాలయంలో మాట్లాడి కొత్త కనెక్షన్లను ఇప్పిస్తామని ఇప్పటి వరకు అచ్చయ్యనగర్‌లో 5 ఇళ్లకు నూతన కనెక్షన్లను ఇప్పించామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. బీజేపీ నాయకులు గడ్డం నవీన్, శివ, రాకేష్, రామకృష్ణ, మల్లేష్ తదితరులున్నారు.

యూనివర్సిటీ కాంట్రాక్ట్ సిబ్బందికి కనీస వేతనం ఇవ్వాలి

కవాడిగూడ: తెలంగాణ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్, వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 63 ప్రకారం కనీస వేతనాలు చెల్లించి ఈఎస్ఐ, పీఎఫ్, చట్టబద్ధ సౌకర్యాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. మెట్టురవి, అవుర్, సమ్మయ్య, మహేందర్, చిరంజీవి, మహ్మద్ సలాల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డిజిటల్ టెక్నాలజీ గ్రామాలకూ చేరువ కావాలి

సుల్తాన్‌బజార్: డిజిటల్ టెక్నాలజీని గ్రామాలకు చేరువ కావాలని ఏఎల్ఈఏపీ హైదరాబాద్ చైర్‌పర్సన్ డాక్టర్ రమాదేవి అన్నారు. తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయ ఉమెన్స్ సెల్ ఆధ్వర్యంలో కోఠి మహిళా విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో జాతీయ సెమినార్ అయిన డిజిటల్ ఇన్నోవేషన్ టెక్నాలజీలో లింగ సమానత్వం అనే అంశంపై ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ రమాదేవి హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే అవకాశాలు నేటి యువత అందిపుచ్చుకోవాలన్నారు. సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఉమెన్స్ స్టడీ సెంటర్ డైరెక్టర్ సునితారాణి మాట్లాడుతూ.. సమాజంలో డిజిటల్ విప్లవం రావాల్సి ఉందన్నారు.

ఢిల్లీకి తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



కాచిగూడ: పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తూ.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుక్రవారం ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు కాచిగూడ డివిజన్ నుంచి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఎక్కాల కన్నా ఆధ్వర్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున్న తరలివెళ్లారు. కేంద్ర ప్రభుత్వం కక్షసాధింపు ధోరణిని మానుకోవాలని లేని పక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కవితకు తెలంగాణ ప్రజలు అండగా ఉన్నారని విశ్వాసం వ్యక్తం చేశారు.

మహిళలకు ఆదర్శం సావిత్రీబాయి పూలే



నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు జ్యోతి



బాగ్‌లింగంపల్లి వర్ధంతి సభలో మాట్లాడుతున్న శంకర్

కాచిగూడ: మహిళలకు మార్గదర్శిగా, తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చరిత్రకెక్కిన సావిత్రీబాయి పూలే మహిళా లోకానికి ఆదర్శమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాలు జ్యోతి అన్నారు. సావిత్రీబాయిపూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాచిగూడలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమీల, భారతి, లక్ష్మీ, సుజాత, సరళ, రాజేశ్వరి తదితరులున్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో...

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సావిత్రీబాయి పూలే స్ఫూర్తితో గృహకార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో డీబీఎఫ్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే అని ఆమె స్ఫూర్తితో గృహ కార్మికులు, పర్యావరణ శ్రామికుల కోసం ఉద్యమించాలన్నారు. బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్, కల్పన, నాగయ్య, రమేష్, జనార్దన్, సైకిలాబ్‌బాబు తదితరులున్నారు.

కుల నిర్మూలన పోరాట సమితి ఆధ్వర్యంలో...

- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అలివేలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సరిత, నేషనల్ అట్రాసిటీస్ ప్రివేన్షన్ ఫోర్స్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, కేఎన్‌పీఎస్ అధ్యక్షుడు జయరాజు, ప్రధాన కార్యదర్శి అభినవ్ తదితరులున్నారు.

భారత సమాజానికి ఆదర్శమూర్తి : మద్దికాయల అశోక్

- బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా మద్దికాయల అశోక్ మాట్లాడుతూ.. సావిత్రీబాయి స్ఫూర్తితో మహిళలు రాజ్యాధికారం వైపు పయనించాలని పిలుపునిచ్చారు. నాయకులు సుకన్య, రవి, ఉపేందర్‌రెడ్డి, సుధాకర్, వెంకన్న, మట్టయ్య, వెంకన్న, తుకారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

- దేశం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉందని పాలకవర్గం ఉత్పత్తి వ్యవస్థను శ్రమ జీవుల సంస్కృతిని ధ్వంసం చేస్తోందని ప్రొఫెసర్ కంచె ఐలయ్య ఆరోపించారు. శుక్రవారం స్వేచ్ఛ జేఏసీ, సాంస్కృతిక సంఘాల ఆధ్వర్యంలో ఆటాపాటా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. దేశంలో 2–3 కులాల ప్రయోజనాల కోసం ఈ దేశాన్ని వెనక్కి తీసుకుపోతుందన్నారు. కుల వ్యవస్థను అంతం చేయడానికి చాలా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు ప్రముఖ గేయ రచయిత జయరాజ్, స్వేచ్ఛ జేఏసీ కన్వీనర్లు రమేష్, జనార్దన్, ప్రముఖ గాయకురాలు విమలక్క, ప్రొఫెసర్ సుజాత, సైకిలాబ్‌బాబు, శంకర్, విజయ్‌కుమార్, భూపతి వెంకటేశ్వర్లు, డాక్టర్ జిలకర శ్రీనివాస్, అన్వేష్ తదితరులున్నారు.



సావిత్రీబాయిపూలేకు నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ కంచె ఐలయ్య, విమలక్క తదితరులు

సామాజిక పునాదిలో పురుషాధిపత్యం

ప్రొఫెసర్ హరగోపాల్ వెల్లడి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక పునాదిలో పురుషాధిపత్యం, కులం, మతం ఆవహించి ఉన్నాయని వీటి ఆధిపత్యం పెరిగిపోతుందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. 'ఏకీభవించనోని పీక నొక్కే సిద్ధాంతమే ఫాసిజమని' ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాయల సుభాష్‌చంద్రబోస్ (రవన్న) 7వ వర్ధంతి సందర్భంగా 'భారతదేశం ఫాసిస్టు ప్రమాదం' అనే అంశంపై స్మారకోపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. పురుషాధిపత్యం వల్లనే మహిళలపై హింస, అణచివేత పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్త్రీని రెండో శ్రేణి పౌరులుగా మారుస్తున్నారన్నారు. వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకురాలు కె.రమా, అఖిల భారత విద్యావేదిక నాయకులు రమేష్‌పట్నాయక్, సామాజిక వేత్త దేవి, రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, కే.జీ.రామచందర్, రంగయ్య, వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఎం.హన్మేష్, పద్మ, ప్రభాకర్ తదితరులున్నారు.

'కాన్షీరామ్‌కు భారత రత్న ఇవ్వాలి'



కరపత్రాన్ని విడుదల చేస్తున్న డాక్టర్ పిడమర్తి రవి తదితరులు

కవాడిగూడ: బహుజన రాజకీయ పితామహుడు, బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు కాన్షీరామ్‌కు భారతరత్న ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర తొలిఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. మార్చి 15న కాన్షీరామ్ జయంతి సందర్భంగా బహుజన రాజకీయ చైతన్య సభ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజా, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. దీనికి సంబంధించిన కరపత్రాన్ని లోయర్‌ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద విడుదల చేశారు. ముస్లిం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రహీం, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ, బీఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు సురేష్, నాయకులు ఉపేందర్, సాయన్న, మహేందర్, ప్రసాద్, నరేష్, కిరణ్, సాంబశివుడు, రేవంత్ తదితరులున్నారు.

మహిళాభివృద్ధే దేశాభివృద్ధి

నల్లకుంట: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆధ్యాత్మిక ప్రసంగీకురాలు డాక్టర్ అనంతలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలుగు భాషా చైతన్య, ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నాగయ్య కళాపీఠం సంయుక్తాధ్వర్యంలో 'పురాణాలలో మహిళలు– వారి పాత్ర' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన ఆమె మాట్లాడుతూ.. పురాణాల్లో స్త్రీలకు ఇచ్చిన ప్రాధాన్యత గురించి వివరించారు. నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, మోడ్రన్ స్కూల్ సంయుక్త కార్యదర్శి సరోజినీదేవి, ప్రముఖ సంగీత విద్వాంసురాలు లలిత, రాధ కుసుమ, తెలుగు భాషా చైతన్య సమితి బడేసాబ్, కవి విశ్లేషకుడు రామకృష్ణ చంద్రమౌళి, గిరిజా రాణి పాల్గొన్నారు.

ఫీవర్ ఆసుపత్రిలో..

- టీజీఎంఈయూ ఫీవర్ ఆసుపత్రి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి ఆసుపత్రి సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ జయలక్ష్మి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు.



ఆధ్యాత్మిక ప్రసంగీకురాలు డాక్టర్ అనంతలక్ష్మి తదితరులు



నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఆసుపత్రి ఆర్ఎంఓ

అభివృద్ధి పనులు ప్రారంభం

అంబర్‌పేట: బాగ్‌అంబర్‌పేట డివిజన్ భరత్‌నగర్‌లో రూ.14.5 లక్షలతో నిర్మించే డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, చుక్క జగన్, చంద్రమోహన్, బాల్‌రాజ్ తదితరులున్నారు.



డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ తదితరులు

దేవస్థాన సేవా సమితి ఎన్నికల్లో అండగా ఉండాలని వీహెచ్‌కు వినతి



వీహెచ్‌కు విజ్ఞప్తి చేస్తున్న చింతల శ్రీనివాస్‌ముదిరాజ్

అంబర్‌పేట: ప్రతిష్టాత్మక అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఎన్నికల్లో అండగా ఉండాలని చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ ప్యానల్ మాజీ ఎంపీ హన్మంతరావుకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం డీడీ కాలనీలోని ఆయన నివాసంలో కలిసి ఎన్నికల వివరాలను తెలియజేశారు. అంబర్‌పేటలో పెద్ద మనిషిగా తమ ప్యానల్‌పై ఆశీస్సులు ఉండాలని శ్రీనివాస్‌ముదిరాజ్ హన్మంతరావును కోరారు. ప్యానల్ సభ్యులు చంద్రశేఖర్, సంజీవచారి, అశోక్ తదితరులున్నారు.

'బీఆర్‌ఎస్ మోసాలకు అదుపులేకుండా పోతోంది'



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ నేతలు

ముషీరాబాద్: తెలంగాణ అమరుల ఆశయాలకు తూట్లు పొడుస్తున్న బీఆర్‌ఎస్‌ని వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని రాష్ట్ర అధికార ప్రతినిధులు కొంగరి అరుణ, డా. వెంకటేష్ చౌహాన్, డా. సాంబశివగౌడ్‌లు అన్నారు. మహిళలపై అత్యాచారాలు, లాకప్‌డెత్‌లు, అవమానాలు పెరిగిపోతున్నాయన్నారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ..

'రేపో మాపో లిక్కర్ స్కాంలో అరెస్ట్ కాబోతున్నందుకు కల్వకుంట్ల కవిత మహిళా బిల్లు' అనే అంశాన్ని ఎత్తుకున్నారని విమర్శించారు. తెలంగాణ జాగృతిలో బహుజనులను మెడపట్టి బయటకు గెంటేసి ఇప్పుడు కష్టాల్లో ఉన్నారని పేరు మార్చుకుని మరోసారి మోసం చేసేందుకు యత్నిస్తున్నారని ఆగ్రహంవ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మహిళలపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. సొంత కూతురు వద్దకు రాగానే మహిళా బిల్లు, సాధికారిత గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని భవిష్యత్తులో తగిన గుణపాఠం చెబుతారన్నారు.

'తెలుగు భాషకు పట్టం కట్టిన శ్రీకృష్ణదేవరాయలు'



చిక్కడపల్లి: 'దేశ భాషలందు తెలుగు లెస్స' అని పలికి శ్రీ కృష్ణదేవరాయలు తెలుగు భాషకు పట్టం కట్టారని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అన్నారు. శుక్రవారం త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళా వేదికలో గానసభ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు సంస్మరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు. భాష దేశ సంస్కృతిని ఉన్నత స్థితిలో నిలిపిన కవులు, సాహితీవేత్తలు వివిధ రంగాల ప్రముఖుల జయంతితో వారిని స్మరించుకోవటం ఉత్తమ సంస్కారమన్నారు. జర్నలిస్ట్ హాస్య అవధాని శంకర నారాయణ, గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, గానసభ కార్యదర్శి బండి శ్రీనివాస్, చంద్రశేఖర్, కళ్యాణ్ తదితరులున్నారు.

'శాసన మండలిలో ప్రశ్నించే వారికి ప్రాధాన్యతనివ్వండి'



దోమలగూడలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కవాడిగూడ: ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల్లో ప్రశ్నించే గలానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని బీజేపీ సీనియర్ నాయకులు వెంకటేష్ ఉపాధ్యాయులను కోరారు. ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల సందర్భంగా దోమలగూడలోని బీజేపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దోమలగూడలో ఇంటింటికి తిరిగి ఉపాధ్యాయులను కలిసి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్), ఉపాధ్యాయ, అధ్యాపక ఉమ్మడి సంఘాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఏ.వీ.ఎన్.రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

- ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను అమలు చేయకుండా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.
- 317 జీఓతో భార్యభర్తలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ.వీ.ఎన్.రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కవాడిగూడ డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ.మహేందర్‌బాబు, ప్రభాకర్ గంగపుత్ర, రమేష్, సాయి, బాణాల అనిల్ తదితరులున్నారు.

కాచిగూడ: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీజేపీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ గోలి మధుసూదన్ రెడ్డి కోరారు. శుక్రవారం కాచిగూడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల నమూనా బ్యాలెట్ పత్రాలను అందజేశారు. బీజేపీ సీనియర్ నేత కన్నె రమేష్‌యాదవ్, బండారు సంతోష్, సుభాష్ పటేల్, ప్రవీణ్, మల్లికార్జున్, భీమ్‌రాజ్ తదితరులున్నారు.

నవరత్న మహిళా పురస్కారాల ప్రదానం



చిక్కడపల్లి: జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా నవరత్న మహిళా పురస్కారాలను ప్రదానం చేశారు. శుక్రవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయగానసభలో గుడిబండి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కే.వీ.రమణాచారి హాజరై పురస్కారాలను వివిధ రంగాలకు చెందిన మహిళలకు అందజేసి గౌరవించారు. డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, దక్షిణ మధ్య రైల్వే పూర్వ జనరల్ మేనేజర్ రామకృష్ణ, వాగ్దేవి సంగీత నిలయం (గుంటూరు) వ్యవస్థాపకులు రామరాజు, లక్ష్మీశ్రీనివాస్, ఆదర్శ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డా.భోగరాజు, గిడుగు రామ్మూర్తి పంతులు, ఫౌండేషన్ చైర్మన్ కాంతి కృష్ణ, ఎస్ఆర్ఆర్, చారిటబుల్ ట్రస్ట్ డాక్టర్ ఎస్.రామచంద్రరావు, సంఘ సేవకురాలు విజయలక్ష్మి తదితరులున్నారు.

ఎమ్మెల్యేల ఛాయ్ పే చర్చా !



ముషీరాబాద్: ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిలు హిమాయత్‌నగర్‌లోని ఓ కేఫ్ వద్ద కలిసి ఛాయ్ తాగారు. ఇద్దరు ఎమ్మెల్యేలు ఛాయ్ తాగుతూ.. పలు విషయాలను చర్చించడాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

పాన్ అప్‌డేట్ పేరుతో కుచ్చు టోపీ

నల్లకుంట: బ్యాంక్ ఖాతాకు పాన్‌కార్డును అనుసంధానం చేసుకోవాలని వచ్చిన మెసేజ్‌కు స్పందించిన ఓ వ్యక్తి ఖాతా నుంచి సైబర్ కేటుగాళ్లు నగదును చోరీ చేసిన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లకుంటలో నివసించే వ్యాపారి కనాల పార్దు (35)కు హిమాయత్‌నగర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ఖాతా ఉంది. కాగా ఖాతాకు పాన్ నంబర్ అప్‌డేట్ చేసుకోవాలంటూ ఈ నెల 5వ తేదీన ఉదయం 10 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి మెసేజ్ వచ్చింది. నిజమేనని నమ్మిన అతడు లింక్‌ను ఓపెన్ చేసి వివరాలను పొందుపరచగా.. క్షణాల్లోనే అతడి ఖాతా నుంచి రూ. 98,999 విత్ డ్రా చేసుకున్నట్టు మెసేజ్ రావడంతో మోసపోయానని గ్రహించి బాధితుడు శుక్రవారం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సైబర్ క్రైమ్‌గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్యాంకర్ ఢీకొని వృద్ధురాలి మృతి

కాచిగూడ: ఆయిల్ ట్యాంకర్ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో ఫుట్‌పాత్ వద్ద ఉన్న ఓ గుర్తు తెలియని వృద్ధురాలు (65)ను ఆయిల్ ట్యాంకర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందింది. అడ్మిన్ ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రమ శిక్షణతో చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్తు



ముషీరాబాద్: క్రమ శిక్షణతో చదువుకున్నప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్‌యాదవ్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో సత్ఫలితాలు సులువుగా సాధించవచ్చన్నారు. చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల కార్యదర్శి రత్నం, పీఈటీ కిషోర్, ఉపాధ్యాయులు మీరాకుమారి, శాంతి, జ్యోతి, హరిప్రసాద్, అజయ్, సుల్తానా తదితరులున్నారు.